

ఫిజికల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ

- 8 వారాల పైలెట్ ప్రోగ్రాం అమలు
- సిఎం రేవంత్‌రెడ్డితో 'అనలాగ్ ఎఐ' సిఇఒ కిప్మన్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వినూత్నంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సిఎంను 'అనలాగ్ ఎఐ' సిఇఒ అలెక్స్ కిప్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ పలు అంశాలపై చర్చించారు. ట్రాఫిక్, పట్టణ వరదలు, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన మార్గాలపై మాట్లాడుకున్నారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్‌వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులపై పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని, దీనికోసం 8వారాల శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. సిసి టివి వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌గా మార్చడంతో పాటు ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేసి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహణ చేపడతారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని అనలాగ్ సిఎం సిఇఒను ఆహ్వానించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు రూ.161 కోట్లు విడుదల చేయండి

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు రూ.161 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతోపాటు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 2,813 జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన రూ.161 కోట్ల బకాయిలు ఉన్నట్టుగా అధికారులు సమీక్షలో నిర్ధారించారని తెలిపారు. మొత్తం రూ.161 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలి

- అవన్నీ బిజెపి ప్రభుత్వ హత్యలే..
- మావోయిస్టులతో చర్చలు జరపాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సిపిఎం జనగామ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం హత్యలు చేస్తోందని, బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను హత్య చేయడానికి సిపిఎం వ్యతిరేకిస్తోందని చెప్పారు. లొంగిపోయేందుకు వచ్చిన వారిని ఎన్‌కౌంటర్లు చేయడం హేయమైన చర్య అన్నారు. మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలన్నారు. మావోయిస్టు అగ్రనేత తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారమని, ఆయనను వెంటనే కోర్టు ముందు హాజరుపరచాలని, ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ బీజేపీ ప్రభుత్వ హత్యలేనని, లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్న మావోయిస్టులను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. హిడ్మాను, దేవోజీలను ఎన్‌కౌంటర్ల పేరిట చంపినంత మాత్రాన దేశంలో ఆర్థిక అసమానతలు, లైంగికదాడులు, హత్యలు, అరాచకాలు తగ్గవన్నారు. రాజ్యహింసను, మతోన్మాదాన్ని, అసమానతలను, దోపిడీని వ్యతిరేకించడంలో ఒక్కొక్కరు ఒక్కో రకమైన పంథా అవలంబిస్తారన్నారు. మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందని నమ్మారని గుర్తు చేశారు. కానీ, ప్రజాస్వామ్యం ద్వారా ఎన్నికై ప్రభుత్వం ఏర్పాటు చేశామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం.. మావోయిస్టుల పట్ల అవలంబిస్తున్న విధానం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో మావోయిస్టులను పట్టుకుని జైల్లో పెట్టే అవకాశం ఉన్నప్పటికీని, వారిని పట్టుకొని బూటక ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయడం అప్రజాస్వామికం కాదా? అని ప్రశ్నించారు. మావోయిస్టులను మట్టుపెట్టినంత మాత్రాన ప్రజా ఉద్యమాలు ఆగవని జాన్‌వెస్లీ అన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం సృష్టించడం సరైంది కాదన్నారు. బలం ఉందని.. తామేం చేసినా నడుస్తుందని విర్రవీగిన నియంతలందరూ చరిత్రలో, మట్టిలో కలిసిపోయారని, అందుకు హిట్లర్ చరిత్రనే నిదర్శనం అని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం తిరుగుబాటు ఉంటుందని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిరంతరం ప్రజల కోసం పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలు అలాంటి అవకాశాన్ని వినియోగించుకుని తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

- కేంద్రమంత్రికి సిఎం రేవంత్‌రెడ్డి సలహా
- రాష్ట్రంలో ఈ పథకం సక్సెస్ అయ్యిందని వివరణ
- దీనివల్ల బియ్యం మార్కెట్ ధరలు స్థిరపడ్డాయని వివరణ
- సిఎం విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని, దీన్ని దేశమంతా విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీనివల్ల పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గి, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని వివరించారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుటుందని హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించాలంటూ సిఎం పలు అంశాలను కేంద్రమంత్రి వద్ద ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పిడిఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన (పిఎంజికెఎవై) అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలని, ఎఫ్‌సిఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందని, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించుకోవాలని సూచించారు.

విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారం చెల్లించాల్సిందే

- ఆ నిబంధనను నూతన విత్తన చట్టం-2025లో పొందుపర్చాలి
- రైతుకు మేలు చేసేలా మార్పులు చేయాలి : మంత్రి తుమ్మల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విత్తనాలతో రైతులు నష్టపోతే సంబంధింత కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించే నిబంధనను నూతన విత్తన చట్టం-2025లో పొందుపర్చాలనీ, రైతులకు మేలు చేసేలా ఆ ముసాయిదా చట్టంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నూతన విత్తన చట్టంపై వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, కమిషనర్ డాక్టర్ గోపి, అదనపు కమిషనర్ నరసింహారావు, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్‌చాన్సలర్ ఆల్దాస్ జానయ్య, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు సుచరిత, రామలక్ష్మి, ఉప సంయుక్త సంచాలకులు అనిత, తెలంగాణ రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పాల్గొన్నారు. ముసాయిదా చట్టం విధివిధానాలను, లోటుపాట్లను మంత్రి తుమ్మల వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో విత్తనం ప్రాథమిక అవసరమనీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. విత్తన చట్టం 1966, విత్తన నియంత్రణ ఉత్తర్వు 1983లో పలు లోపాలుండటంతో విత్తన సంస్థలు రైతులకు నష్టం చేకూరుస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత ముసాయిదా చట్టాన్ని వెబ్‌సైట్‌లో పొందుపర్చిందని తెలిపారు. దానిపై రైతువేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలనీ, వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకుని ముసాయిదా చట్టంలోని లోపాలను అధిగమించేందుకు చేయాల్సిన మార్పులు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పొందుపర్చాల్సిన అంశాలను సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాలు చేసినప్పుడు పంట నష్టం జరిగితే త్వరిగతిన పరిష్కరించి రైతులకు న్యాయం చేసేలా, కంపెనీ నుంచి నష్టపరిహారం పొందేందుకు తప్పని సరిగా నిబంధనలు పెట్టేలా చట్టంలో మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు. విత్తనోత్పత్తి రైతులకు నాణ్యతలేని విత్తనాల వలన నష్టం జరిగినప్పుడు సంభందిత విత్తన కంపెనీ పై చర్యలు తీసుకునేలా ముసాయిదా చట్టంలో నిబంధనలు పెట్టకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రతిపాదిత ముసాయిదా చట్టంపై చేయాల్సిన మార్పులు, చేర్పులపై డిసెంబర్ 11లోగా పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

ప్రజాపంపిణీ బకాయి నిధులు విడుదల చేస్తాం

- 2030 వరకు 5 కిలోల ఉచిత బియ్యం
- ఆయిల్ సీడ్స్, వాణిజ్య పంటలూ పండించాలి
- కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణకు రావాల్సిన కోవిడ్ సమయానికి సంబంధించి ప్రజాపంపిణీ వ్యవస్థ బకాయి నిధులు రూ.343 కోట్లు వెంటనే విడుదల చేస్తాం.. అలాగే సిఎంఆర్ డెలివరీకి సంబంధించి 10 ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1400 కోట్లకు సరైన రికార్డులు సమర్పిస్తే పరిశీలించి మంజూరు చేస్తాం.." అని కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్‌జోషి చెప్పారు. ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతి నెల ఐదు కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నామని, దాన్ని 2030 వరకు కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించినట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికీ 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం ఇవ్వడం ప్రారంభించినట్టు చెప్పారు.

దేశవ్యాప్తంగా వ్యాప్తంగా 2 కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ప్రతినెలా తెలంగాణకు 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు కేటాయిస్తున్నామని, లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3370 మెట్రిక్ టన్నుల గోధుమలు ఇస్తున్నట్టు చెప్పారు. ఆహార భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డులన్నిటినీ డిజిటలైట్ చేసినట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, ప్రస్తుతం ప్రారంభించిన ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాంలో 62 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అన్నారు. ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్‌సీఐ గోదామును జిల్లాలో నిర్మించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 2014 -15 నుంచి తెలంగాణలో ధాన్యం సేకరణను 600శాతం పెంచినట్టు చెప్పారు. రైతులు వరి ధాన్యం వైపే కాకుండా ఆయిల్ సీడ్స్, వాణిజ్య పంటలు పండించాలని కోరారు.

సీఎంఆర్ బకాయిలు రూ.1400 కోట్లు విడుదల చేయాలి : ఉత్తమ్

రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి 2024- 25 సంవత్సరానికి సంబంధించి బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని, పదేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1400 కోట్ల సీఎంఆర్ బకాయిలు చెల్లించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి సబ్సిడీ రూ.343 కోట్లు వెంటనే విడుదల చేయాలని, 2024- 25 ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ కాలపరిమితిని 60 రోజులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంబంధించి యాసంగి 120 రోజులకు పెంచాలని, తెలంగాణకు అదనపు రేక్‌ల సౌకర్యాన్ని కల్పించాలని, 2025-26కు సంబంధించి ధాన్యం సేకరణ టార్గెట్‌ను 80 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి పెంచాలని అన్నారు. ప్రస్తుత ఎఫ్‌సిఐ గోదాంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం వరకు పెంచాలని కోరారు. తెలంగాణ ఖరీఫ్‌లో 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, 80 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నదని, ఇదివరకే 29 వేల కోట్ల రూపాయలను ధాన్యం కొనుగోలుపై ఖర్చు చేసినట్టు తెలిపారు.

బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలి : కోమటిరెడ్డి

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా బత్తాయి పంటకు ప్రసిద్ధి చెందిందని, జిల్లాకు 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ధాన్యానికి సంబంధించి ప్రయివేటు ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును మంజూరు చేయాలని అన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, భారత ఆహార సంస్థ ఈడి వనిత శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్‌సిఐ అధికారులు పాల్గొన్నారు

కెటిఆర్ విచారణకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్

ఇ-కార్ రేసింగ్ కేసుపై ఎసిబి దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసనసభ్యుడు కేటీఆర్‌ను విచారించడానికి ఎట్టకేలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏసీబీకి అనుమతిచ్చారు. ఈ మేరకు గురువారం గవర్నర్ సంతకంతో ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ-కార్ రేసింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా కేటీఆర్, రెండో, మూడో నిందితులుగా హెచ్ఎండీఏ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, సీఈఓ బీఎల్ఎన్ రెడ్డితో పాటు ఫార్ములా-ఈ కంపెనీ నిర్వాహకుల పైన ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ముఖ్యంగా రూ.54.88 కోట్లను ఫార్ములా ఈ-కార్ రేసింగ్ నిర్వాహకులకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి కానీ, ఆర్బీఐ నుంచి కానీ ఎలాంటి అనుమతులను పొందకుండా చెల్లింపులు చేశారని వీరిపై ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఈ నిధులను హెచ్ఎండీఏ నుంచి మంజూరు చేశారనీ, ఇందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మునిసిపల్ వ్యవహారాల శాఖ మంత్రి అయిన కేటీఆర్ అనుమతిచ్చారని ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి, ఏసీబీ అధికారులకు ఇచ్చిన వివరణలో తెలియజేశారు. ఈ కేసు విచారణను చేపట్టిన ఏసీబీ అధికారులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో పాటు కేటీఆర్‌ను నాలుగుమార్లు విచారించారు. చివరికి కోర్టులో చార్జిషీటు వేసి వీరిని ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వాల్సిందిగా రాష్ట్ర విజిలెన్స్ విభాగానికి నివేదికను పంపించారు. ఆ నివేదికను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిస్తూ మరోవైపు నిబంధనల ప్రకారం కేటీఆర్‌పై చార్జిషీటు వేసి ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతిని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దాదాపు రెండు నెలల క్రితం తనకు అందిన ప్రతిపాదనను గవర్నర్‌కు పంపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు.. కేటీఆర్‌పై చార్జిషీటు వేసి ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిని కోరారు. ఆనాటి నుంచి గవర్నర్ అనుమతి కోసం అధికారులు చకోర పక్షుల్లా ఎదురు చూశారు. ఎట్టకేలకు గవర్నర్ అనుమతి లభించడంతో కేటీఆర్‌తో పాటు అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, ఫార్ములా ఈ-కార్ రేసు ప్రతినిధులపై న్యాయపరంగా చర్యలు తీసుకోవడానికి నడుం బిగించారు. అయితే అరవింద్ కుమార్ సివిల్ సర్వెంట్ కావటం, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా కేంద్రంలోని డీఓపీటీ నుంచి కూడా అనుమతి రావాల్సి ఉన్నది. దీనిపై డీఓపీటీకి లేఖ రాసిన ఏసీబీ అధికారులు.. ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ విషయానికి సంబంధించి డీఓపీటీ నుంచి ఇంకా అనుమతి రావాల్సి ఉన్నది. దీనిపై ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారుసిన్హా తన సీనియర్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోవైపు ఇప్పటికే ఈ-ఫార్ములా కార్ రేసింగ్ కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులపై పీఎంఎల్ఏ కేసులను నమోదు చేయడమేగాక వారిని కూడా విచారించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసులో తమ అనుమతి లేకుండా విదేశాలకు రూ.54.88 కోట్లకు పైగా నిధులను తరలించినందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్బీఐ రూ.7 కోట్ల జరిమానాను కూడా విధించిన విషయం విదితమే.

పకడ్బందీ పంచాయతీ ఎన్నికలు

- జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలకు ఎస్ఇసి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) ఆదేశించింది. గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణ, ఎన్నికల నిర్వహణకు రవాణా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పరిశీలకుల మోహరింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈ నెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను డిసెంబరు 16 వరకు పూర్తి చేయనున్నట్టు సమాచారం.

ఖనిజ రంగంలో దూసుకు పోతున్న తెలంగాణ

హైదరాబాద్ బ్యూరో :కీలక ఖనిజ రంగంలో తెలంగాణ దూసుకు పోతున్నదని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇటీవల నిటి ఆయోగ్ సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కీలక ఖనిజాభివృద్ధి కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి స్థానం కల్పించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిద్దాం

- పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరం
- పేదల కోసం పనిచేసే మావోయిస్టులతో చర్చలెందుకు జరపరు?
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నేతలు
- నేడు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను హత్యచేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది. బూటకపు ఎన్‌కౌంటర్లను తప్పుబడుతూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించింది. పాక్ ఉగ్రదాడులపై సైతం చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వం..ప్రజల కోసం పనిచేస్తున్న దేశపౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపట్లేదని ప్రశ్నించింది. బూటకపు ఎన్‌కౌంటర్లపై పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదముందని హెచ్చరించింది. అటవీ ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపదను మార్చి 2026 నాటికి కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ సర్కారు మాట ఇచ్చిందనీ, అందుకే అడ్డుగా ఉన్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేయిస్తున్నదని విమర్శించింది. లొంగిపోయేందుకు ప్రయత్నించిన వారిని, కాల్పులు విరమించి షెల్టర్ తీసుకుంటున్న మావోయిస్టులను చుట్టుముట్టి కాల్చి చంపడాన్ని తప్పుబట్టింది. దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం దేశభక్తి ఎలా అవుతుందని ప్రశ్నించింది.

దేశంలో కమ్యూనిస్టులు బలపడాలి : టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

దేశంలో కేంద్రంలోని మోడీ సర్కారు విధానాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. వామపక్షభావజాలం ఉన్న వారిని బలహీనపర్చే ఎలిమినేషన్ ప్రక్రియను బిజెపి సర్కారు ప్రారంభించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, సోషలిస్టు భావజాలం కలిగిన ఇతర పార్టీలు ఏకమై బీజేపీపై పోరాడాల్సిన ఆవశ్యకత నేడు నెలకొందని చెప్పారు. ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. బీహార్ తరహాలో తెలంగాణలోనూ కేంద్రం సర్‌ను ప్రవేశపెట్టబోతున్నదన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అధికారమే పరమావధిగా భావించి దేశాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పాలకుల హింసనే కాదు మావోయిస్టుల తరపున జరిగే హింసను సైతం తాము వ్యతిరేకిస్తున్నామనీ, అయితే, బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిస్తామని స్పష్టం చేశారు. జీవితాంతం ప్రజల కోసం పోరాడిన వారు జన జీవన స్రవంతి లో కలుస్తామని చెప్పితే వినకుండా పట్టుకుని చంపడం ఏం పద్ధతి అని ప్రశ్నించారు.

న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవపరీక్షలు చేయాలి : కూనంనేని

ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపిన మావోయిస్టుల మృతదేహాలకు న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్షలు నిర్వహించాలనీ, దాన్ని వీడియో తీయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాముని పేరు చెబుతూ బీజేపీ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తున్నదని విమర్శించారు. మానవ హననం చేయాలని అమిత్‌షా, మోడీలకు ఏ శాస్త్రం, ఏ ధర్మం చెబుతున్నదని నిలదీశారు. ఎన్ కౌంటర్ అంటే ఏమిటో కూడా తెలియనివారు కేంద్ర మంత్రులుగా ఉండటం మన దౌర్భాగ్యమని ఎద్దేవా చేశారు. తమకు, మావోయిస్టులకు మధ్య భావజాలంలో తేడా ఉన్నప్పటికీ అందరం పేద వర్గాల కోసమే పని చేస్తామని చెప్పారు. ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని, ఇప్పటి వరకు జరిగిన ఎన్ కౌంటర్ల పైన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ, మోడీని ప్రశ్నిస్తే దాడులు : మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

దేశంలో మోడీ, బీజేపీ విధానాలను ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా దాడి జరుగుతున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మావోయిస్టులతో పాటు అన్ని రంగాలపైనా, వ్యవస్థలపైనా ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక దాడి జరుగుతున్నదని విమర్శించారు. బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డం పెట్టుకుని అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలను బలహీనపర్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చి ఏదో ఒక రకంగా పాలనా వ్యవస్థను తన గుప్పిట్లోకి తీసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు దేశంలోని ఖనిజవనరులను అప్పనంగా అప్పగిస్తూ..అదే సమయంలో సామాన్యులపై పన్నుల మీద పన్నుల భారం మోపుతూ...అప్పుల మీద అప్పులు చేస్తూ దేశాన్ని 200 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లే పనిలో బీజేపీ ఉందని విమర్శించారు.

హింసతో రాజకీయ ఉద్యమాలను ఆపలేరు : కోదండరామ్

టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రాజకీయ ఉద్యమాలను హింసతో రూపుమాపలేరనీ, వ్యక్తులను చంపినా సిద్ధాంతం బతికే ఉంటుందని చెప్పారు. మనుషులను చంపే అధికారం చట్టం ఎవ్వరికీ ఇవ్వలేదన్నారు. ఎన్ కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపైన కూడా కేసు నమోదు చేసి విచారించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్, సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నాయని గుర్తుచేశారు. రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కి మోడీ సర్కారు పాలన చేస్తున్నదని విమర్శించారు.

అభివృద్ధి నమూనాలో మానవతా విలువలేవి : ప్రొఫెసర్ హరగోపాల్

కేంద్రం ప్రభుత్వం చెబుతున్న 'అభివృద్ధి నమూనా'లో మానవతా విలువలు లేవని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. అటవీ ప్రాంతాల్లోని వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మహారాష్ట్రంలో 1.25 లక్షల చెట్లు, చత్తీస్‌గఢ్‌లో 2.25 లక్షల చెట్లను కూల్చి పర్యావరణ విధ్వంసం చేయడం అవసరమా? అని ప్రశ్నించారు. మోడీ సర్కారుది రూట్‌లెస్ అభివృద్ధి నమూనా అనీ, అది నిరుద్యోగాన్ని పెంచే నమూనా అనీ, కార్పొరేట్ నమూనా అని విమర్శించారు. కేంద్రం ఎవరి మాటలనూ వినడం లేదని, రాజ్యాంగం, చట్టాలను కూడా అమలు చేయడం లేదని వాపోయారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ బూటకపు ఎన్ కౌంటర్లను ప్రభుత్వం మానుకోవాలనీ, మావోయిస్టులతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో మావోయిస్టులు కూడా సాయుధపోరాటాన్ని వదిలి ప్రజాజీవితంలోనికి రావాలని కోరారు. మనుషులను పట్టుకుని కాల్చిచంపడం ఆర్టికల్ 21 ఒప్పుకుంటుందా? అని ప్రశ్నించారు. అరుణోదయ సాంస్కృతిక మండలి నాయకులు విమలక్క మాట్లాడుతూ ఎన్ కౌంటర్ల పేరుతో కేంద్రం మానవ హననం చేస్తోందన్నారు. మావోయిస్టులు చేసేది హింస అయితే కేంద్రం చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు హన్మేశ్, సీపీఐ(ఎంఎల్). న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతిరావు, సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ రాజా, సీపీఐ(ఎం.ఎల్) చంద్రన్న గ్రూప్ నాయకులు భాస్కర్,, ఎస్‌యుసీఐ (యు) నేత మురహరి, సీపీఐ (ఎంఎల్). నాయకులు గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, బండి సంజయ్ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమన్నారు. తెలంగాణ పౌర హక్కుల సంఘం నాయకులు నారాయణ, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాయాదేవి, నెదునూరి జ్యోతి, రమావత్ అంజయ్య నాయక్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రవాస భారతీయుల రక్షణకు కట్టుబడి ఉన్నాం

- 'ఓవర్సీస్ మొబిలిటీ బిల్ 2025'లో కేంద్రం కీలక సంస్కరణలు తేవాలి
- బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల్లో పనిచేస్తున్న, పనిచేయడానికి వెళుతున్న భారతీయ కార్మికులు, నిపుణుల ప్రయోజనాలు, రక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. "ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు, 2025" ముసాయిదాపై తెలంగాణ ప్రభుత్వం, ఎన్‌ఆర్‌ఐ సలహా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఐఎఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో సంప్రదిపుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ మొదలగు జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం ప్రజలు వలస పోతున్నారని అన్నారు. చాలా సందర్భంలో వారు మోసాలకు గురి కావడం, పని చేస్తున్న దేశంలో వేధింపులు ఎదుర్కోవడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న కొత్త బిల్లు వీటన్నింటికి పరిష్కారం చూపాలని ఆకాంక్షించారు. తెలంగాణ నుంచి వలస వెలుతున్న వారి సంక్షేమానికి కేంద్రం మరింత చొరవ చూపాలని కోరారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త బిల్లు ప్రవాస భారతీయులకు రక్షణగా నిలుస్తుందని అన్నారు. వలస విధానంలో మార్పు, విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు నంగి.దేవందర్‌రెడ్డి, నరేశ్ పరికిపండ్ల, వినోద్‌కుమార్ వాటాదారులు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల

- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సిఎంకు ధన్యవాదాలు : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేతన్న రుణమాఫీ పథకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారనీ, దానికి సంబంధించి రూ.33 కోట్లను విడుదల చేశామని జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొండా లక్ష్మణ బాపూజీ జయంతి సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు టెస్కోకు రూ.588 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చిందని గుర్తుచేశారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, హన్మకొండ జిల్లాల్లోని 130 ఎమ్ఏసీఎస్, 56 ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద సహాయక సంఘాల మహిళా సభ్యులకు అందించే చీరల ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ప్రభుత్వ అవసరాల కోసం వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని జీవో నెంబర్ 1ని రాష్ట్ర సర్కారు జారీ చేసిందని పేర్కొన్నారు. రూ.168 కోట్లతో తెలంగాణ చేనేత అభయహస్తం పథకంలో భాగంగా మూడు పథకాలను అమలు చేస్తోందని వివరించారు. నేతన్న భరోసా పథకంలో భాగంగా కనీసం 50శాతం ఉత్పత్తి చేసిన నేత కార్మికులకు ఏటా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.ఆరు వేలు ప్రోత్సాహం అందించే పథకానికి రూ.12 కోట్లు కేటాయించామని తెలిపారు. నేతన్నలు చనిపోతే రూ.ఐదు లక్షలు బీమా అమలు చేస్తున్నామనీ, ఇప్పటివరకు 541 కుటుంబాలకు రూ.27.05 కోట్లు చెల్లించామని వివరించారు. నేత కార్మికుల పిల్లలకు ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసి మూడేండ్ల డిప్లొమా కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. పవర్‌లూమ్ ఆసాముల దీర్ఘకాలిక డిమాండ్ అయిన యార్న్ డిపోను వేములవాడలో రూ.50 కోట్లతో ఏర్పాటు చేశామని వివరించారు. టెస్కోకు బకాయిపడ్డ రూ.630 కోట్లు విడుదల చేశామని తెలిపారు. పవర్ లూమ్ యూనిట్లకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. మరమగ్గాల కార్మికులకు పది శాతం యార్న్ సబ్సిడీ పథకం కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిపడ్డ రూ.39.72 కోట్లను తమ ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లో టెక్స్ పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రారంభించడం ద్వారా 800 మంది మహిళలకు ఉపాధి కల్పించామని తెలిపారు.

గీత కార్మికులకు పరిహారం చెల్లించండి

- వారికిచ్చే పెన్షన్‌పై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి
- నాన్‌డ్యూటీ లిక్కర్ అరికట్టండి
- సమీక్షా సమావేశంలో రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లుగీత కార్మికులు చనిపోయినప్పుడు, ప్రమాదాల్లో గాయపడిన సంఘటనల్లో వారికి సకాలంలో పరిహారం చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు అధికారుల్ని ఆదేశించారు. బడ్జెట్ రాక పోవడంతో కొందరికి పరిహారం చెల్లించలేకపోతున్నామంటూ అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తానే స్వయంగా ప్రభుత్వంతో మాట్లాడతానని ఆయన చెప్పారు. గీత కార్మికులకు చెల్లించే పెన్షన్ వివరాలను రికార్డుల్లో రాయడంతో పాటు వారికి సకాలంలో అందుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. అలాగే చనిపోయిన గీత కార్మికుల స్థానంలో కొత్తవారికి పెన్షన్ అందించేందుకు కృషి చేయాలని సూచించారు. గురవారంనాడిక్కడి ఆబ్కారీ భవన్‌లో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలనీ, ఆ దిశగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు పని చేయాలని చెప్పారు. కొత్త మద్యం పాలసీ ప్రకారం దుకాణాల కేటాయింపులు పూర్తయ్యాయనీ, అక్రమ మద్యాన్ని అరికట్టి, దుకాణదారులకు అమ్మకాలు పెరిగేలా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సీ హరికిరణ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలంగాణ బేవరీజెస్ అమ్మకాలు, మద్యం తయారీ కంపెనీల వివరాలు, తయారీ, వినియోగం, లేబుల్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరు వంటి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి రఘునందనరావు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

JEH AEROSPACE

హైదరాబాద్‌లో జేహ్ ఏరోస్పేస్ ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్: వేగంగా ఎదుగుతున్న ఏరోస్పేస్ తయారీ కంపెనీల్లో ఒకటైన జేహ్ ఏరోస్పేస్ కొత్తగా హైదరాబాద్ కొత్తూరులోని హెరైజన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో తదుపరి తరం తయారీ ప్లాంట్ మార్క్ 2 ఏర్పాటును ప్రకటించింది. ఈ కొత్త ప్లాంటు విస్తీర్ణం సుమారు 2,00,000 చదరపు అడుగులుగా ఉంటుంది. దీనితో హైదరాబాద్‌లో ప్రస్తుతం జేహ్‌కి గల కార్యకలాపాలు నాలుగురెట్లు పెరిగి 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెరిగిందని జేహ్ ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సిఇఒ విశాల్ సంఘవి తెలిపారు.

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులకు ఉందని సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా "బాలల ప్రజావాణి"ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సాహించాలనీ, పిల్లల మనోభావాలకు అనుగుణంగా పెద్దలు ముందుకు సాగాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల గౌరవంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయొద్దని చిన్నారెడ్డి సూచించారు. బాలల హక్కులను పరిరక్షించాలని కోరారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, యూనిసెఫ్ సౌత్ ఇండియా చీఫ్ జలేలం తఫెసీ, చైల్డ్ రైట్స్ సంస్థ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిగాచి బాధితులకు రూ.కోటి పరిహారం హామీ ఏమైంది?

- సిఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచి బాధితులకు రూ.కోటి పరిహారం హామీ ఏమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. సిగాచి పరిశ్రమ ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా బాధితులకు పరిహారం అందలేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చింది రూ.26 లక్షలేనని ప్రభుత్వం బాకీ పడింది రూ.74 లక్షలు ఉందని పేర్కొన్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పడం కాదా?అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులను కూడా ప్రభుత్వం ఇప్పించే నష్టపరిహారంలో చూపించడం దిగజారుడుతనానికి నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి నిస్సిగ్గుగా బాధితులకు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు అందించామని ప్రకటించడం అత్యంత శోచనీయమని విమర్శించారు. చికిత్స ఖర్చులను పరిహారంలో కోత విధించడం అమానవీయమని తెలిపారు.

ఎన్‌టిపిసి బూడిదపై గుత్తాధిపత్యం

- అర్హులకు టెండరు దక్కినా పనులకు అడ్డంకి..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- న్యాయం కోసం కుందనపల్లి నిర్వాసితుల ఎదురుచూపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మేం నిత్యం తీవ్రమైన కాలుష్యంతో సహజీవనం చేస్తున్నాం.. మమ్మల్ని ఆదుకోవడంలోనూ, మాకు ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వాలు, సంస్థ యాజమాన్యం విఫలమవుతూ వస్తోంది. మా ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు దక్కాల్సిన అవకాశాలు స్థానికేతరులు పొందుతున్నారు. ఉపాధి కరువై ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఎన్‌టిపిసి కరెంటు ఉత్పత్తిలో భాగంగా వచ్చే బూడిద వ్యర్థాలను తరలించేలా టెండరు వేసి వేలంలో దక్కించుకున్నా.. బడా కాంట్రాక్టర్లు అడ్డుతగులుతున్నారు. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్‌టిపిసి ప్రభావిత ప్రాంతమైన కుందనపల్లి నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్‌టిపిసి కరెంటు ఉత్పత్తిలో భాగంగా వచ్చే బూడిద వ్యర్థాలను తరలించేలా సంస్థ యాజమాన్యం అందరికీ టెండరు దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. దీనిలో భాగంగా నిర్వాసిత గ్రామమైన రాజాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది టెండరు దాఖలు చేసి ఆ టెండరును దక్కించుకున్నారు. ఈ గ్రామంలో 540 ఎకరాల భూమిని ఎన్‌టిపిసి బూడిద చెరువు కోసం అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో అక్కడి వారు టెండర్లు వేసి పనులు చేసేందుకు ముందుకొచ్చారు. మొత్తం 30లక్షల టన్నుల బూడిదకు.. టన్నుకు రూ.30చొప్పున 19లక్షల టన్నులకు, రూ.26తో 11 లక్షల మెట్రిక్ టన్నులకు వేలాన్ని దక్కించుకున్నారు. 40మంది కలిసి ఈ వేలంలో పాల్గొని ఈ టెండర్లు సొంతం చేసుకున్నారు. దీనిలో కుందనపల్లికి చెందిన నలుగురు ఉన్నారు.

అధికార పార్టీ ఏదైనా.. హవా వీరిదే..

ఎన్‌టిపిసి నిర్వహించే కాంట్రాక్టు టెండరు ఏదైనా.. కొంతమంది బడా కాంట్రాక్టర్లదే హవా కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉండి అప్పుడు పనులు చేసిన వారు.. ఇప్పుడు ప్రభుత్వం మారినా వారే ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. తమను అధికారేతర పార్టీ ప్రజలుగా ముద్రవేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కుందనపల్లి నుంచి టెండర్ దాఖలు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ఆచరణ ఎక్కడా..?

ఎన్‌టిపిసి నిబంధనల మేరకు 2లక్షల మెట్రిక్ టన్నుల లోపు బూడిద తరలింపునకు ఆన్‌లైన్ ద్వారా టెండరు దక్కించుకున్న వారు ఎలాంటి యంత్రాలనూ వినియోగించకూడదన్న నిబంధన ఉంది. 50వేల టన్నులకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ జేసీబీ లాంటి యంత్రాలను ఈ తరలింపునకు వినియోగించుకునే అవకాశం లేదు. దీంతో టెండర్లు దక్కించుకున్న నలుగురు కాంట్రాక్టర్లు కలిసి పనిచేస్తూ 2లక్షల టన్నులకుగాను యంత్రాలను వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించారు. నలుగురు చిన్న కాంట్రాక్టర్లు కలిసి పనిచేసే విధానాన్ని తట్టుకోలేని.. బడా కాంట్రాక్టర్లు యంత్రాలు వినియోగించకుండా అడ్డుకుంటున్నారు. పని జరగకుండా నిలువరిస్తే బడా కాంట్రాక్టర్లను ఆశ్రయిస్తారని, తమ చెప్పుచేతల్లో ఉంటారనే కుయుక్తులు పన్నుతున్నారు. అలా చిన్నచిన్న కాంట్రాక్టర్లలందరూ పెద్ద కాంట్రాక్టర్లను ఆశ్రయించేలా ఎన్‌టిపిసి యాజమాన్యంతో కలిసి ఒత్తిడి చేయిస్తున్నారు. పెద్ద కాంట్రాక్టర్ల జేసీబీలను వినియోగించుకునేలా ఒప్పందం చేసుకునేలా కుట్ర చేస్తున్నారు. దీంతో చిన్న కాంట్రాక్టర్లు తమకు మిగిలే కొద్దిపాటి లాభాన్ని సైతం పెద్ద కాంట్రాక్టర్ల జేసీబీలకు చెల్లించాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు.

అన్ని అర్హతలున్నా.. అధిపత్యం ఎందుకు..?

కాంట్రాక్టు నిబంధనలకు సంబంధించి టెండర్లలో పాల్గొనేవారికి అర్హతలు ఉన్నవారందరూ ఈ యేడాది మార్చిలో నిర్వహించిన టెండర్లలో పాల్గొన్నారు. టన్ను బూడిదకు ఎన్‌టిపిసి రూ.1 చొప్పున ధర నిర్ణయించగా.. కుందనపల్లికి చెందిన నిర్వాసితులు టెండరు దాఖలు చేసి పనులు దక్కించుకున్నారు.

నిబంధనలకు అనుగుణంగా రూ.76 వేలను ఎన్‌టిపిసి ఖాతాలో డిపాజిట్ చేశారు. జిఎస్‌టి, సొసైటీ రిజిస్ట్రేషన్ లాంటి అన్ని అర్హతలు ఉండి పనులు దక్కించుకున్న చిన్న కాంట్రాక్టర్లు పనులు చేయకుండా పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు వెళ్లనీయడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు అన్ని వసతులు కల్పించి పనులు కొనసాగేలా చూడాల్సిన ఎన్‌టిపిసి యాజమాన్యం దీనిపై మౌనం వహిస్తూ పెద్ద కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ సమస్యలపై ఎన్‌టిపిసి అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఎన్‌టిపిసి అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయడంగానీ ప్రకటనగానీ చేయడం లేదు. ఒక వేళ లిఫ్ట్ చేసినా తెలుగేతర భాషలో మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

భూములు కోల్పోయినా అన్యాయమే..
దుబాసి పరమేశ్వర్, కుందనపల్లి

అధికారికంగా అన్ని అర్హతలతో టెండర్లు దక్కించుకున్నా పనులు జరగడం లేదు. నిర్వాసిత ప్రజలుగా మేము భూములు కోల్పోయినా మాకు తగిన న్యాయం జరగడం లేదు. కాలుష్యాన్ని భరిస్తూ అనారోగ్య పాలవుతున్నా ఎన్‌టిపిసి యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మాపై ఆధారపడి చాలా మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. మాకు న్యాయం జరిగేలా ఎన్‌టిపిసి యాజమాన్యం చొరవ చూపాలి.

ఎన్‌టిపిసి యాజమాన్యం బాధ్యత వహించాలి
చిలుక ప్రసాద్, కుందనపల్లి

ఆన్‌లైన్ ద్వారా టెండరు దక్కించుకున్న మా తరపున ఎన్‌టిపిసి యాజమాన్యం బాధ్యత వహించాలి. నిబంధనలకనుగుణంగా మేము డిపాజిట్ చేసిన నగదుతోపాటు మా పనులు సవ్యంగా కొనసాగేలా చూడాలి. సీఐఎస్ఎఫ్, ఎన్‌టిపిసి యాజమాన్యం పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చర్య తీసుకోవాలి. మాపై అధిపత్యం చేస్తున్న వారి టెండర్లు రద్దు చేసేలా ఎన్‌టిపిసి కఠిన నిబంధనలు అమలు చేయాలి.

జంబ్లింగ్ పద్ధతిలో ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి


- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ పబ్లిక్, ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు లేఖ రాశారు. ఇంటర్‌లో 50 శాతం పైగా ఎంపిసి గ్రూపులో, 25 శాతం వరకు బైపీసీ గ్రూపులో చదువుతుండగా ఎంపిసి విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీలో, బైపిసి విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. తాను ఇటీవల ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో మాట్లాడిన అనుభవాలను ఆయన కృష్ణ ఆదిత్య దృష్టికి తీసుకెళ్లారు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న పేరెన్నికగన్న ప్రయివేటు కాలేజీల్లో చదువుతున్న వారికి ప్రాక్టికల్ నిర్వహించలేదని అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. "ఫిజిక్స్‌కు సంబంధించి వెర్నియర్ కాలిపర్స్ గాని, స్క్రూ గేజీ గాని, అయస్కాంత బల రేఖలు అంటే గాని, విద్యుత్ నిరోధకం, డిసి కరెంటుకు ఉదాహరణను విద్యార్థులు చెప్పలేకపోయారు. కెమిస్ట్రీలో ఆసిడ్స్, బేసెస్, కెమికల్స్, బ్యూరెట్, పిప్పెట్ లాంటివి చూసినట్టు లేదు. బాటనీలో డైకాటమిస్టెమ్, మోనోకాటమిస్టెమ్, కైండ్స్ ఆఫ్ ఫ్లవర్స్ పరిశీలించినట్టు లేదు. జువాలజీలో వర్టిబ్రేట్, నాన్ వర్టిబ్రేట్, ఎర్త్ వార్మ్ నర్వ్ రింగ్, హార్ట్స్ ఇన్ కాక్రోచ్, ఫ్రాగ్ డిసెక్షన్ వంటి అంశాలు కూడా వారికి తెలిసినట్టు లేదు.." అని అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "గత సంవత్సరాలలో పరిశీలిస్తే ప్రాక్టికల్ పరీక్షల్లో ఆ ప్రయివేటు కళాశాలల విద్యార్థులకు 58/60, 59/60, 60/60 మార్కులు వచ్చినట్లు మెమోలలో పరిశీలించాను. ఇంటర్మీడియట్లో ప్రాక్టికల్స్ నామమాత్రంగా చేయిస్తున్నారు. ఇటువంటి విధానం సరైనది కాదు. ప్రాక్టికల్ పరీక్షల కొరకే ప్రాక్టికల్స్ చేయిస్తున్న కళాశాలలు కూడా ఉన్నట్టు తెలిసింది. తాను 1976 -78 సంవత్సరాలలో ఇంటర్మీడియట్ విద్యను, బైపీసీ గ్రూపు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేటలో చదివాను. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ నాలుగు సబ్జెక్టులలో, ఒక్కొక్క సబ్జెక్టుకు 50కి పైగా ప్రాక్టికల్స్ చేశాము. ప్రస్తుతం ప్రయివేటు కళాశాలలతో పాటు ప్రభుత్వ కళాశాలలలో కూడా ప్రాక్టికల్స్ సంఖ్య తగ్గాయి. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించటం ద్వారా మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.." అని అలుగుబెల్లి నర్సిరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.

టెక్నాలజీతో మైనింగ్ రంగంలో ఉత్పత్తి పెంపు

- పరిశ్రమల రంగానికి మూల సంపద ఖనిజాలు
- అస్కీలో మైనింగ్‌పై జాతీయ సదస్సులో వక్తలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెక్నాలజీతో మైనింగ్ రంగంలో ఉత్పత్తిని పెంచొచ్చని, విశాలమైన ఈ విశ్వంలో అపారమైన ఖనిజ సంపద కలిగి ఉండటం ప్రకృతి మనకిచ్చిన వర ప్రసాదమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరి సర్వోత్తమన్ తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గురువారం నుంచి ప్రారంభమైన మూడ్రోజుల మైనింగ్ జాతీయ సదస్సు 'ఆపరేషనల్ ఎక్సెలెన్స్ ఇన్ మైన్స్ త్రూఇన్నోవేటివ్ టెక్నాలజీ'ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పరిశ్రమల రంగానికి ఖనిజాలు మూల సంపదని, గుండు పిన్ను తయారీ నుంచి రాకెట్ ప్రయోగాల వరకు ఖనిజ సంపద అవసరమని చెప్పారు. గ్లోబల్ పోటీని ఎదుర్కోవాలంటే మైనింగ్ రంగంలో ఇంకా ప్రపంచ స్థాయి టెక్నాలజీలు, నూతన ఆవిష్కరణలు అవసరం ఉందని అన్నారు. ఆపరేషనల్ ఎక్సలెన్స్ ద్వారా వృథా తగ్గిపోయి ఉత్పాదకత, కార్మికుల భద్రత పెరుగుతుందన్నారు. ఓయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ.. మైనింగ్ రంగం ప్రపంచవ్యాప్తంగా ఆటోమేషన్, డిజిటలైజేషన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ వైపు వేగంగా పయనిస్తోందన్నారు. ఆటోమేషన్, రోబోటిక్స్, రియల్ టైం మానిటరింగ్ సిస్టమ్స్, డేటా అనలిటిక్స్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ తదితర ఆధునిక టెక్నాలజీల ద్వారా దేశ ఆర్థిక పురోగతిలో మైనింగ్ రంగం ప్రధానపాత్రను పోషిస్తున్నదన్నారు.

ఎన్ఐటి, సురత్కాల్‌లో సివిల్ ఇంజినీరింగ్ హెడ్‌గా పనిచేసిన డాక్టర్ డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి జాతీయ వేదికలు ఇంజినీరింగ్ ప్రముఖులను కలుపుతుందన్నారు. అకాడెమియా, పరిశ్రమలు, ప్రభుత్వ వర్గాలందరూ తమ ఆలోచనలను పంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

పరిశ్రమల వెన్నెముక ఖనిజాలు

ఖనిజాలు పరిశ్రమల వెన్నెముక అని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్ రావు తెలిపారు. మైనింగ్ ప్రొఫెషనల్స్, ఇంజనీర్లు, భద్రతాధికారులు, పాలసీ మేకర్లు పాల్గొంటున్న ఈ జాతీయ సదస్సు స్మార్ట్ మైనింగ్ పరిష్కారాల అమలు, ప్రమాదాల తగ్గింపు, వనరుల నిర్వహణ ఆప్టిమైజేషన్ వంటి అంశాలపై చర్చిస్తుందన్నారు ఎస్కీ మైనింగ్ హెడ్ కెజె అమరనాథ్ మాట్లాడుతూ.. భారత మైనింగ్ రంగాన్ని గ్లోబల్ స్టాండర్డ్స్ వైపు తీసుకెళ్లే ఆలోచనలతోనే ఎస్కీ ఇలాంటి జాతీయ సదస్సుల ద్వారా ఒక రోడ్‌మ్యాప్ తయారు చేస్తున్నామన్నారు. ఈ జాతీయ సదస్సుకు సంబంధించిన అంశంపై ప్రముఖుల పరిశోధనాత్మకమైన వ్యాసాలతో సావనీర్‌ను రూపొందించామని, సదస్సులో జరిగే డిబేట్స్ ప్రతిపాదనలను కోల్ ఇండియా, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్, సింగరేణితోపాటు ప్రముఖ ప్రభుత్వ, ప్రయివేట్ ఇంజినీరింగ్ పరిశ్రమలకు పంపిస్తామన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ కె సత్యలక్ష్మి సదస్సు నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సదస్సులో కోల్ ఇండియా, సింగరేణి, ఎన్‌టిపిసి, వెన్సార్ కన్‌స్ట్రక్షన్, జిటిఎస్ మైనింగ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు, మైనింగ్ ఫ్యాకల్టీ ఎల్ కృష్ణ పాల్గొన్నారు.